క్లుప్తంగా

ఉత్సాహంగా ఫ్రెషర్స్‌డే వేడుకలు



అమరావతి: మండల పరిధిలోని ధరణికోట రాజావాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా చలపతి విద్యాసంస్థల అధినేత అంజనేయులు, ధాన్యకటక బుద్ధ విహార ట్రస్టు చైర్మన్ డాక్టర్ వావిలాల సుబ్బారావు, ఎంపీడీఓ ఉమాదేవిలు మాట్లాడారు. ఈసందర్భంగా గతేడాది అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహూమతులు అందచేశారు. అనంతరం విద్యార్థు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈకార్యక్రమంలో కళాశాల పాలకవర్గ సభ్యులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్సిడీపై శనగలు పంపిణీ



ముప్పాళ్ళ: వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సబ్సిడీపై రైతులకు శనగలు పంపిణీని గురువారం ప్రారంభించారు. మండలంలోని అన్ని గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల వద్ద 40శాతం సబ్సిడీపై రబీసాగులో భాగంగా శనగ విత్తనాలు అందించటం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి ఎమ్.అరుణ చెప్పారు. ముప్పాళ్ళ, దమ్మాలపాడు గ్రామాల్లో శుక్రవారం నుంచి పంపిణీ చేస్తామన్నారు. మిగిలిన గ్రామాల్లో ఇప్పటివరకు 106 మంది రైతులకు గాను 37క్వింటాళ్లు పంపిణీ చేశామన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డుతో రైతుభరోసా కేంద్రాల్లో సంప్రదించవచ్చన్నారు.

పాలవెల్లువను సద్వినియోగం చేసుకోండి

అచ్చంపేట: జగనన్న పాలవెల్లువ ద్వారా ప్రభుత్వం ఇచ్చే హామీలేని రుణసదుపాయాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థిక పరిస్థితులను మెరుగు పరచుకోవాలని ఎంపీడీఓ పి.శివసుబ్రమణ్యం తెలిపారు. జగనన్న పాల వెల్లువ పథకంలో భాగంగా మండలంలోని తాళ్లచెరువులోని రైతు భరోసా కేంద్రంవద్ద గురువారం పాల ఉత్పత్తిదారులకు రుణాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తాళ్లచెరువు, కస్తల, తాడువాయి గ్రామాలకు చెందిన 8మంది పాలఉత్పత్తిదారులకు నాణ్యమైన గేదెలు కొనుగోలు చేసుకునేందుకు జిల్లా కేంద్ర సహకర బ్యాంకు ద్వారా ఒక్కొక్కరికి రూ.90వేలు అందజేశారు. పాల ఉత్పత్తిదారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం గ్రామగ్రామాన అమూల్ డైరీలను ఏర్పాటు చేస్తోందన్నారు. వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం షేక్ సలీం మాట్లాడుతూ మండలంలో 850మంది అమూల్ డైరీలకు పాలు పోసే రైతులున్నారని చెప్పారు. వీరు మేలు జాతి గేదెలను కొనుగోలు చేసుకునేందుకు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ద్వారా ఎలాంటి హామీ లేకుండా అతి తక్కువ వడ్డీకి రుణాలు పంపిణీ చేస్తున్నామన్నారు. గ్రామ సర్పంచ్ కిక్కురు అన్నమ్మ, పశువైద్యాధికారి డాక్టర్ స్వాతి, అర్లారెడ్డి, పాల ఉత్పత్తిదారులు, రైతులు పాల్గొన్నారు.

వరిలో ఆకుముడత, తెల్లదోమ నివారణకు చర్యలు

నకరికల్లు: వరిలో ఆకుముడత, తెల్లదోమ తెగులు అధికంగా ఉందని సత్వరమే నివారణ చర్యలు చేపట్టాలని ఏఓ కె.దేవదాసు రైతులకు సూచించారు. మండలంలోని త్రిపురాపురం, నకరికల్లులోని వరిపొలాలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిపైరు ప్రస్తుతం చిరుపొట్ట దశనుంచి పొలుపోసుకునే దశలో ఉందన్నారు. ఆకుముడత, తెల్లదోమ తెగులు కన్పిస్తుందన్నారు. నివారణకు క్లోరంట్రానిలిప్రోల్ 20ఎస్‌సీ మందును 0.4ఎంఎల్ లేదా ఫ్లూబెండమైడ్ 20డబ్ల్యూజీ మందును 0.25మిల్లీ గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. వరిలో పొడతెగులు, మాగుడు తెగులు నివారణకు హెక్సాకొనజోల్ 2 ఎంఎల్ లేదా ప్రొపికొనజోల్ ఒక ఎంఎల్ లేదా వాలిడామైసిన్ ఎంఎల్ లీటరునీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. వ్యవసాయ సహాయకులు ఎం.డి.జాన్‌అహ్మద్, సుభాని, రైతులుపాల్గొన్నారు.

వ్యవసాయ బావిలో మొసలి కలకలం

పరిశీలించిన రెవెన్యూ అధికారులు

నకరికల్లు: వ్యవసాయబావిలో మొసలి సంచరిస్తుండడంతో సమీపంలోని పొలాల రైతులు భయాందోళనలకు గురవుతున్నారు. మండలంలోని నర్సింగపాడు గ్రామం నుంచి త్రిపురాపురం వెళ్లే రహదారి పక్కన కాటూరి శ్రీనివాసరావు అనే రైతుకు చెందిన వ్యవసాయబావిలో మొసలి సంచరిస్తుందన్న విషయం ప్రత్యక్షంగా చూసిన వారు గురువారం అధికారుల దృష్టికి తెచ్చారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ కె.నగేష్ హుటాహుటిన సిబ్బందితో నర్సింగపాడు గ్రామానికి చేరుకొని వ్యవసాయబావిని పరిశీలించారు. వ్యవసాయబావిలో సంచరిస్తున్న మొసలిని పట్టుకొని జంతు సంరక్షణ కేంద్రానికి తరలించాలని అటవీశాఖ అధికారులను ఆదేశించారు.

పాహిమాం .. పరమేశ్వరి!


సత్తెనపల్లిలో శ్రీభువనేశ్వరీ దేవిగా వాసవీ మాతా..


పట్టణంలోని సనారి వీరబ్రహ్మేంద్ర ఆశ్రమంలో చండీదేవి


పట్టణంలోని త్రిశక్తి దుర్గాపీఠంలో మహాలక్ష్మీదేవిగా..


పెద్దమక్కెనలో రూ.3లక్షలు కరెన్సీ నోట్లతో మహాలక్ష్మీదేవి


క్రోసూరులో శ్రీకన్యాదేవిగా అమ్మవారు


అచ్చంపేటలో రాజరాజేశ్వరిగా వాసవీకన్యకాపరమేశ్వరి


75త్యాళ్ళూరులో అన్నపూర్ణదేవిగా అమ్మవారు

- వైభవంగా శ్రీదేవీ శరన్నవరాత్రోత్సవాలు
- పలు రూపాల్లో దర్శనమిచ్చిన అమ్మవారు

సత్తెనపల్లి: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు నియోజకవర్గంలో వైభవంగా నిర్వహిస్తున్నారు. పట్టణంలోని వివిధ ప్రధాన కూడల్లలో ఏర్పాటు చేసిన మండపాలలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో అమ్మవారిని భువనేశ్వరీ దేవిగా, సనారి వీరబ్రహ్మేంద్ర ఆశ్రమంలో అమ్మవారిని చండీ దేవిగా అలంకరించారు. త్రిశక్తి దుర్గా పీఠంలో, కొత్తపేట మహాలక్ష్మమ్మ చెట్టు వద్ద, వెంకటపతి కాలనీలోని నీలంపాటి శ్రీ లక్ష్మీ అమ్మవారి పీఠంలో అమ్మవారిని మహాలక్ష్మీ దేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. సత్తెనపల్లి మండలం పెద్దమక్కెన గ్రామంలోని గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవాలయంలో అమ్మవారిని రూ.3 లక్షలు కరెన్సీ నోట్లతో మహాలక్ష్మీ దేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. పట్టణంలోని వడ్డవల్లి పోలేరమ్మ గుడి, పీర్ల చావిడి వద్ద అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గౌరవమ్మకు మహిళలు, యువతులు పూజలు చేశారు.


సత్తెనపల్లిలో బతుకమ్మ ఆడుతున్న ఉపాధ్యాయినులు, విద్యార్థినులు

అన్నపూర్ణ దేవిగా...

పెదకూరపాడు: 75 త్యాళ్ళూరులో అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయంలో గురువారం అమ్మవారు అన్నపూర్ణ దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున హోమం చేశారు. పెదకూరపాడులోని సాయిబాబా దేవాలయం సమీపంలో బతకమ్మను ప్రత్యేక పూజలు నిర్వహించారు. బతకమ్మ పాటలతో అమ్మవారిని పూజించారు.

రాజరాజేశ్వరిగా...

అచ్చంపేట: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో అమ్మవారు గురువారం రాజరాజేశ్వరిగా భక్తులకు దర్శనభాగ్యం కలిగించారు. శ్రీ సీతారామస్వామివారి దేవాలయంలో ధనలక్ష్మిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళా విభాగం వారిచే భజన కార్యక్రమాలు చేపట్టారు. లలిత, వాసవీ కన్యకాపరమేశ్వరి, సీతాదేవి, పార్వతీదేవిల సహస్ర అష్టోత్తర శతనామార్చనలు నిర్వహించారు.

శ్రీకన్యాదేవీగా..

క్రోసూరు: దసరా శరన్నవరాత్రులు పురస్కరించుకుని గురువారం క్రోసూరు వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారు శ్రీకన్యాదేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, భక్తిపారాయణం మహిళభక్తులు నిర్వహించారు.

లలితా పరమేశ్వరిగా...

బెల్లంకొండ: దసరా శరన్నవరాత్రుల మహోత్సవాలలో భాగంగా మండలంలోని బెల్లంకొండ మహాలక్ష్మీ పీఠంలో గురువారం అమ్మవారు లలితా పరమేశ్వరి అలంకార రూపంలో దర్శనమిచ్చారు. నవ దుర్గలలో ఐదవ అవతారం లలితా పరమేశ్వరి అవతార మని వేద పండితులు పులుపుల వేంకట ఫణి కుమార శర్మ తెలిపారు. గ్రామంలో గల భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా బతుకమ్మ వేడుకలు..

సత్తెనపల్లి: పట్టణంలోని ప్రగతి సీబీఎస్సీ పాఠశాలలో బతుకమ్మ సంబరాలు గురువారం విద్యార్థులు, ఉపాధ్యాయులు కనుల పండువగా నిర్వహించారు. విద్యార్థినులు, ఉపాధ్యాయులు వివిధ రకాల పుష్పాలతో బతుకమ్మలను సర్వాంగా సుందరంగా అలంకరించి గౌరమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. ప్రగతి విద్యాసంస్థల కరస్పాండెంట్ మక్కెన పద్మజ పర్యవేక్షించారు.


పెదకూరపాడులో బతకమ్మకు పూజలు

వైష్ణవిదేవి అలంకారంలో..

ముప్పాళ్ళ: మండలంలోని పలు గ్రామాల్లోని శివాలయాల్లో అమ్మవారు వైష్ణవిదేవి అలంకారంలో గురువారం భక్తులకు దర్శనమిచ్చారు. లంకెలకూరపాడులోని గంగా పార్వతి సమేత ఓంకారేశ్వర స్వామి ఆలయంలోను, చాగంటివారిపాలెంలో ఏర్పాటు చేసిన మండపంలోను, ముప్పాళ్ళలోని అన్నపూర్ణ సమేత రామలింగేశ్వరస్వామి, కుందురు వారిపాలెంలోని వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలోను, అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

అందరికీ ఆరోగ్య భద్రతే లక్ష్యం

- ఎమ్మెల్యే నంబూరు శంకరరావు
- దిడుగు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం ప్రారంభం


జగనన్న ఆరోగ్య సురక్ష కిట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు


సత్తెనపల్లిలో మందుల కిట్ పంపిణీ చేస్తున్న అచ్యుత శివప్రసాద్, ఆకుల రమేష్

అమరావతి: ప్రతి కుటుంబానికి ఆరోగ్య భద్రత అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని పెదకూరపాడు శాసనసభ్యుడు నంబూరు శంకరరావు అన్నారు. గురువారం మండల పరిధిలోని దిడుగు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే శంకరరావు ప్రారంభించారు. తొలుత మహానేత, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం హెల్త్ క్యాంపులో జరుగుతున్న వైద్యపరీక్షలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మాట్లాడుతూ.. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికి వెళ్లి ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రాథమిక వైద్య పరీక్షల ద్వారా అనారోగ్య సమస్యలను గుర్తించడం జరుగుతుందన్నారు. వారికి హెల్త్ క్యాంపుల్లో ఉచిత వైద్యపరీక్షలు, ఉచిత మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. దీర్ఘకాలిక వ్యాధులున్న వారికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్యశ్రీ ఆస్పత్రులకు సిఫార్సు చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఈపథకాన్ని పరి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గత ప్రభుత్వం హయాంలో పేదల ప్రాణాలు గాలిలో దీపాలుగా మారాయని మండిపడ్డారు. దోచుకోవడం తప్ప.. ప్రాణాలు కాపాడాలన్న కనీస ఆలోచన కూడా లేకుండా పోయిందన్నారు. జగనన్న పాలనలో ఆస్పత్రులు కొత్త రూపు సంతరించుకున్నాయన్నారు. నియోజకవర్గంలో సుమారు రూ.25 కోట్లతో ప్రభుత్వాస్పత్రులు ఆధునికీకరిస్తున్నామన్నారు. ప్రతి గ్రామంలో హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేసి నాణ్యమైన వైద్యసేవలను ఇంటి ముందుకే తెచ్చామన్నారు. అత్తలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి శివరత్నకుమార్ మాట్లాడుతూ శిబిరంలో వైద్యాధికారులు మౌనిక, రవిబాబు, గీతా కల్యాణ్, కళ్యాణిలు 554మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అంచేశారని తెలిపారు. ఎంపీపీ మేకల హనుమంతరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు, గ్రామ సర్పంచి వింతా శ్రీలక్ష్మీ, వైఎస్సార్ సీపీ నాయకులు వింతా బ్రహ్మారెడ్డి, రోశయ్య ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, సచివాలయ సిబ్బంది, ఆయుష్ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

గుండ్లపల్లిలో 507మందికి వైద్యపరీక్షలు..

నకరికల్లు: వైద్యశిబిరాలకు విశేష ఆదరణ లభిస్తుందని ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండలంలోని గుండ్లపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం గురువారం నిర్వహించారు. 507 మందికి వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలందరికీ వైద్యసేవలు అందాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిగ్రామంలోను ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని అన్నారు. డాక్టర్ వి.శ్రీనునాయక్, డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి, డాక్టర్ నాగమణి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఎంపీపీ మేచారపు అనురాధ, సర్పంచ్ కొత్తపల్లి ప్రసాద్, ఉప సర్పంచ్ జూపల్లి మోషే, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమీజున్, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

సత్తెనపల్లిలో 503 మందికి ..

సత్తెనపల్లి: ఎలాంటి అనారోగ్య సమస్యలు లేకుండా పేదలు కూడా సంపూర్ణ ఆరోగ్యంగా జీవించాలనే ఉద్దేశంతోనే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు, 24వ వార్డు కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్ అన్నారు. పట్టణంలోని 23, 24 వార్డు ప్రజలకు మున్సిపల్ కార్యాలయం వెనుక గల కమ్యూనిటీ హాల్‌లో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అచ్యుత శివప్రసాద్ మాట్లాడుతూ 2004 ముందు ఉన్నత స్థాయి వైద్యం చేయించుకోవాల్సి వస్తే ఆస్తులు అమ్ముకోవాల్సి వచ్చేదన్నారు. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అధికారంలోకి రాగానే గుండె, ఉన్నత వైద్యాన్ని ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు అందుబాటులోకి తెచ్చారన్నారు. 23వ వార్డు కౌన్సిలర్ ఆకుల రమేష్ మాట్లాడుతూ ఇటువంటి వైద్య శిబిరాలు ప్రజలకు ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. ప్రజలు సద్వి నియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఈ శిబిరాలను వినియోగించు కోవాలన్నారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ జి.ధర్మ సింగ్ శాస్త్రి, డాక్టర్ ఎస్ ప్రభా, డాక్టర్ అనిలా రెడ్డి, డాక్టర్ రవి శంకర్ రెడ్డిలు 503 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. 170 మందికి ల్యాబ్ పరీక్షలు నిర్వహించారు. 82 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించి 43 మందికి వైఎస్సార్ కంటి వెలుగు కింద కళ్లజోళ్లు అందించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ పోషక ఆహార ప్రదర్శనను నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శెట్టి ఆనంద్, వైఎస్సార్ సీపీ నాయకుడు వల్లెం నరసింహారావు, మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, మేనేజర్ ఎస్.సాంబశివరావు, వడ్డవల్లి యూపీహెచ్‌సీ, ఏరియా వైద్యశాల సిబ్బంది, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, వార్డు వలంటీర్లు పాల్గొన్నారు.

రెంటపాళ్లలో 523 మందికి..

జగనన్న ఆరోగ్య సురక్ష పేద ప్రజలకు ఎంతో మేలని పాకాలపాడు పీఏసీఎస్ అధ్యక్షుడు కొర్లకుంట వెంకటేశ్వర్లు అన్నారు. సత్తెనపల్లి మండలం రెంటపాళ్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వైద్యులు డాక్టర్ యూఎస్ఎల్.కవిత, డాక్టర్ ఎస్‌వీఎస్ సాయి తేజారెడ్డి, డాక్టర్ సాదియా, డాక్టర్ వంశీ కుమారిలు 523 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి 15 మందిని మెరుగైన వైద్యం కోసం ఉన్నత ఆసుపత్రులకు రిఫర్ చేశారు. మిగిలిన వారికి మందులు పంపిణీ చేశారు. 842 మందికి ల్యాబ్ పరీక్షలు నిర్వహించారు. 114 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించి 83 మందికి కండ్లజోళ్లు పంపిణీ చేశారు. 15 మందిని కాటరాక్ట్ పరీక్షలకు రిఫర్ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు ఏకుల మత్తయ్య, తహసీల్దార్ ఎస్.సురేష్, ఎంపీడీఓ జీవి సత్యనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తాళ్లచెరువులో 531మందికి ..

అచ్చంపేట: జగనన్న ఆరోగ్య సురక్షతో నిరుపేదలు వ్యాధులబారి నుంచి రక్షణ పొందుతున్నారని జడ్పీటీసీ సభ్యుడు తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని తాళ్లచెరువులో గురువారం నిర్వహించిన వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రతి గ్రామంలో వైద్యశిబిరాలను ఏర్పాటు చేసి నిపుణులైన వైద్యులచే పరీక్షలు నిర్వహించి నాణ్యమైన, ఖరీదైన మందులను పంపిణీ చేయడం సీఎం వైఎస్ జగన్‌కే సాధ్యమన్నారు. గ్రామంలో మొత్తం 531మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఇద్దరిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ వైద్యశాలలకు రిఫర్ చేశారు. 187మందికి కంటి పరీక్షలు నిర్వహించి 172మంది కంటి అద్దాలకు ఎంపికచేశారు. పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ఇన్నారావు, డాక్టర్ రాంబాబు, స్పెషలిస్ట్ వైద్యులు ఎస్.ప్రేమ, ఎస్.గిరిరాజు తదితరులు వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కిక్కురు అన్నమ్మ, ఎంపీటీసీ గోపు అంథోనురెడ్డి, ఆరోగ్య విస్తరణాధికారి పి.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి

ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య



మాట్లాడుతున్న ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య

పెదకూరపాడు: ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కలిసి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రతి ఒక్కరికి ప్రచారం చేయాలని ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య అన్నారు. పెదకూరపాడులోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. జలజీవన్ పనులు వేగవంతం చేయాలని, విద్యుత్ శాఖ అధికారులు గ్రామాల్లో చిన్నచిన్న సమస్యలను కూడ పరిష్కరించలేకపోతున్నారని పలువురు సభ్యులు సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా మీరయ్య మాట్లాడుతూ దశల వారీగా అవసరమైన చోట స్తంభాలు ఏర్పాటు చేయాలని సూచించారు. వ్యవసాయశాఖ రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. ఐసీడీఎస్ అందిస్తున సేవలను సూపర్‌వైజర్ మున్ని తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రతి పేదవాడి ఇంటికే వైద్య సేవలు అందుతున్నాయని 75త్యాళ్ళూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుంకర ప్రియాంక అన్నారు. జెడ్పీటీసీ కంకణాల స్వర్ణకుమారి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుల, మత, వర్గ, పార్టీల రహితంగా అన్ని వర్గాల వారికి సంక్షేమం, అభివృద్ధి పనులు చేస్తున్నారని ప్రతి ఒక్కరు ప్రభుత్వ సేవలను తెలియజేయాలన్నారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆధ్వర్యంలో పెదకూరపాడు మండలం అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. ఎంపీడీఓ నరసింహరావు, తహసీల్దార్ జియాఉల్‌హక్, వైస్ ఎంపీపీలు షేక్ చాంద్‌బాష, మేరిరాణి, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ


చిన్నారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేట: రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన ముగ్గురు పిల్లలకు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అండగా నిలచారు. ముఖ్యమంత్రి సహాయ నిధిద్వారా మంజూరైన రూ.2లక్షల చెక్కును ఎమ్మెల్యే నంబూరు శంకరరావు గురువారం వారింటికి వెళ్లి కుటుంబ పెద్దలకు అందజేశారు. మండలంలోని గ్రంథశిరి ఎస్సీ కాలనీకి చెందిన చిలకా సునీల్, మరియకుమారి దంపతులిరువురూ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. వారికి ముగ్గురు సంతానం. తల్లిదండ్రులను కోల్పోవడంతో వారికి వృద్ధాప్యంలో ఉన్న అవ్వా, తాతలే దిక్కయ్యారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శంకరరావు సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.2లక్షలు మంజూరు చేశారు. భవిష్యత్‌లోనూ వారికి అన్నివిధాలుగా అండదండలు అందజేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. పిల్లలను ఎంతవరకైనా తాను చదివిస్తానని హామీ ఇచ్చారు. ఏ అవసరం వచ్చినా ఎవరి ప్రమేయం లేకుండా నేరుగా తనవద్దకు రావచ్చన్నారు. గ్రామ సర్పంచ్ రావెళ్ల శ్రీధర్, కోటపాటి శ్రీనివాసరావు, పార్టీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, వైస్ ఎంపీపీ గంగసాని బాబు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు రూ.2లక్షల చెక్కు పంపిణీ..

దొడ్లేరు(క్రోసూరు): మండలంలోని దొడ్లేరు గ్రామానికి చెందిన బాధితురాలు భీమ్‌రెడ్డి అనూషాకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.2లక్షల చెక్కును ఎమ్మెల్యే నంబూరు శంకరరావు గురువారం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు తాను ఎల్లప్పుడు అండగా నిలుస్తానన్నారు. ఇటీవల గుండెపోటుతో భీంరెడ్డి కృష్ణచైతన్యరెడ్డి మృతి చెందగా ఆతని భార్య అనూషాకు సీఎం రిలీఫ్ చెక్కును అందజేసినట్లు తెలిపారు. గ్రామంలోని వైఎస్సార్ సీపీ నాయకులు సయ్యద్ అబ్దుల్ రహీం, మర్రి కోటిరెడ్డి, ఆవుల అంకిరెడ్డి, మదన్‌రెడ్డి, యార్డు వైస్ చైర్మన్ గార్లపాటి దాసు, ఎంపీపీ పి.కోటయ్య పాల్గొన్నారు.

ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా మంత్రి అంబటి

సత్తెనపల్లి: ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా స్థానిక శాసనసభ్యుడు, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబును నియమించారు. ఈ మేరకు ప్రభుత్వం జీఓ ఎంఎస్ నెంబర్ 49 విడుదల చేసింది. అభివృద్ధి కమిటీ మెంబర్లుగా నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు, సోషల్ వర్కర్‌లు కొత్త రామకృష్ణ, షేక్ కరీం, డాక్టర్ గుండ్లపల్లి గిరిజ, సత్తెనపల్లి ఆర్డీఓ బీఎల్ఎస్ రాజకుమారి, వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణ్ రావు, మహిళా సమైఖ్య టీఎల్ఎఫ్ కొవ్వూరి శైలజ, ఏపీహెచ్ఎంఐడీసీ ఈఈ బి.శ్రీధర్, ఇండియా మెడికల్ అసోసియేషన్ స్థానిక ప్రతినిధి డాక్టర్ ఎస్.రాజమోహన్‌రెడ్డి, అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ చంద్రశేఖర్, ఆహ్వానితులుగా మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మిలను నియమించారు. తొలిసారి ఏరియా వైద్యశాల మెంబర్‌గా నియమితులైన సోషల్ వర్కర్ షేక్ కరీంను వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు కొత్త రామకృష్ణ ఆధ్వర్యంలో గురువారం పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు.

నూతన మెడికల్ ఆఫీసర్‌గా అనూష


డాక్టర్ అనూషను సత్కరిస్తున్న కొత్త రామకృష్ణ, వైద్యులు

సత్తెనపల్లి: పట్టణంలోని ఏరియా వైద్యశాలకు నూతనంగా మెడికల్ ఆఫీసర్‌గా వచ్చిన డాక్టర్ కె.అనూషను వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కొత్త రామకృష్ణ మాట్లాడుతూ కొత్తగా వచ్చిన వైద్యులందరినీ ఘనంగా ఆహ్వానించడం ఒక సాంప్రదాయంగా పెట్టుకున్నామని, అదేవిధంగా ప్రభుత్వ వైద్యశాలకు ఎక్కువ శాతం పేదలు వస్తారని వారందరికీ సేవాభావంతో వైద్యసేవలు అందించాలని కోరారు. అదేవిధంగా వైద్యశాల అభివృద్ధిలో రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ప్రత్యేక శ్రద్ధ వహించడం వల్ల ప్రస్తుతం వైద్యశాల జిల్లాలోనే మొదటి స్థానంలో ఉందన్నారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఏరియా వైద్యశాల ఎంతో అభివృద్ధి చెంది కార్పొరేట్ వైద్యశాలకి దీటుగా వైద్యం అందిస్తున్నామన్నారు. ఆర్ఎంఓ శోభరాణి, నర్సింగ్ సూపరింటెండెంట్ రాధ, మెడికల్ సూపర్ వైజర్ విజయలక్ష్మి, పద్మావతి ఉన్నారు.

ప్రభుత్వ పథకాలను ముమ్మరంగా ప్రచారం చేయండి

క్రోసూరు: గృహసారథులు, సచివాలయ కన్వీనర్లను మరింత చైతన్యపరిచి వచ్చే ఎన్నికల్లో సీఎం జగనన్న పథకాలు, చేసిన పనులను ప్రచారం ముమ్మరంగా చేపట్టే విధంగా ముందుకు తీసుకెళ్లాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు గృహసారథులు, సచివాలయ కన్వీనర్ల పల్నాడు జిల్లా జేఏసీ కో-ఆర్డినేటర్ మొర్తల ఉమామహేశ్వరరెడ్డితో అన్నారు. గురువారం క్రోసూరులో ఎమ్మెల్యే కార్యాలయంలో జేఏసీ కో-ఆర్డినేటర్ ఉమామహేశ్వరరెడ్డి ఎమ్మెల్యేను కలుసుకుని దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. అదేవిధంగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు జేఏసీ కో-ఆర్డినేటర్‌ను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీపీ పి.కోటయ్య, రవి, వైఎస్సార్ సీపీ నాయకులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

నేడు సత్తెనపల్లిలో జగనన్నకు చెబుదాం

సత్తెనపల్లి: పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఈ నెల 20న ఉదయం 10 గంటలకు పల్నాడు జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆధ్వర్యంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ జీవీ సత్యనారాయణ గురువారం తెలిపారు. అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.